రైతుల పక్షాన పోరాడాలి

కందుకూరు, జనవరి 17 : రైతుల పక్షాన ఉంటూ ప్రభుత్వంపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు దీక్షకు మండల యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, యూత్ నాయకులు బొక్క దీక్షిత్‌రెడ్డి, గొర్రెంకల రామకృష్ణ ముదిరాజ్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలువగా యూత్ నాయకులను ఆయన ఆప్యాయంగా పలుకరించి పలు సూచనలు చేశారు. పార్టీకి యూత్ నాయకులు మూల స్తంభాలాంటి వారని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు పోరాటం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసిన కందుకూరు మండల యూత్ నాయకులు

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జనవరి 17: రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారంగా చెత్తాచెదారం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌పై శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి భవానీనగర్, మధురానగర్, శ్రీరామహిల్స్‌కాలనీ ప్రజలు, షాపుల యజమానులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా షాపు ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్త డబ్బాలను ఏర్పాటు చేయని షాపులను సీజ్ చేయడంతో పాటు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, ఎస్ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, జవాన్ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్లు హమీద్, లక్ష్మణ్, కాలనీలవాసులు పద్మారావు, ఆర్‌వీకే వర్మ, నాయకులు యంజాల జగన్, మాధవి, పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాకేశ్ (ఫైల్)

మన్సూరాబాద్, జనవరి 17: నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, అజయ్‌నగర్ కాలనీకి చెందిన తూర్పాటి రాకేశ్ వృత్తిరీత్యా ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాకేశ్ తిరిగి రాలేదు. మధ్యాహ్నం 12.30 గంటలకు తన భార్య మమతకు వాట్సాప్‌లో వీడియో పంపాడు. నాకు చాలా టెన్షన్‌గా ఉంది.. నేను చచ్చిపోతాను.. పిల్లలు జాగ్రత్త అంటూ రాకేశ్ పంపిన వీడియోను చూసి కంగారు పడిన కుటుంబసభ్యులు వెంటనే ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయి ఉంది. రాకేశ్ ఆచూకీ కోసం బంధువులు, మిత్రుల ఇండ్లల్లో వెతికినా జాడ తెలియరాలేదు. రాకేశ్ బ్లూ జీన్స్, రెడ్ కలర్ టీషర్టు వేసుకుని ఉన్నాడు. తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కులతో ఆహ్లాదకరం

సరస్వతీనగర్ కాలనీలో చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

సైదాబాద్, జనవరి 17 : చిన్నారులకు ఆహ్లాదకమైన వాతావరణాన్ని చిల్డ్రన్స్ పార్క్‌లు అందిస్తాయని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. శుక్రవారం సరస్వతీనగర్ కాలనీలో చిల్డ్రన్స్ పార్క్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలోని చిన్నారుల కోసం చిల్డ్రన్స్ పార్క్‌ను అభివృద్ధి చేసి, చిన్నారులు ఆటలు ఆడుకోవటానికి క్రీడా పరికరాలను అందుబాటులోకి తెచ్చామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు సుష్మ, ఏఈ శిరీష, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అమర్‌నాథ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చెన్నారెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, వీరస్వామి, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి

సైదాబాద్, జనవరి 17 : రెవెన్యూ బోర్డు కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ శ్లాబ్ నిర్మాణ పనులను సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కొత్త కమ్యూనిటీ హాల్‌లు కాలనీవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొని వచ్చిన వివిధ సమస్యలను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీవాసులు సత్యనారాయణబాబు, శ్రీనివాస మూర్తి, రాంప్రసాద్, పాండు, డీఎస్ శాస్త్రీ, శ్రీనివాసరావు, మంజులారెడ్డి పాల్గొన్నారు.

ఉపయోగంలేని వస్తువులను ఇచ్చేయండి

సిబ్బందికి కొత్త దుస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్ రెడ్డి

సైదాబాద్, జనవరి 17 : జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్ అధికారులు సైదాబాద్ ఎస్బీహెచ్-ఏ కాలనీ పార్క్‌లోని మాదవ నిలయంలో ఏర్పాటు చేసిన త్రిబుల్ ఆర్ సెంటర్‌ను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణారవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు తమ వద్ద ఉన్న అవసరంలేని, పనికిరాని వస్తువులు ఇతరులకు అవసరానికి పనికొస్తాయని, అందుకోసం తమ వద్ద ఉన్న వాటిని ఇతరులకు ఇచ్చేయాలన్నారు. వ్యర్థాలను తొలగించడానికి జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన కార్యక్రమానికి కాలనీవాసులు సహకరించాలని, పాతబట్టలు, ప్లాస్టిక్ వస్తువులు, ఉపయోగించలేని వస్తువులను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ డీసీ శంకర్ సింగ్ రాథోడ్, ఏఎంహెచ్‌వో రుద్ర శ్రీనివాస్, ఎస్ఎస్ గోవింద్ రెడ్డి, జవాన్లు నర్సింగ్ రావు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు ఇంటింటి సర్వే

కొత్తగూడలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కందుకూరు, జనవరి 17 : ప్రభుత్వ పథకాల కోసం ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో సర్వేను నిర్వహిస్తున్నారు. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, వంటి పథకాలపై ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సరిత తెలిపారు. ఈ నెల 20 వరకు సర్వేను పూర్తి చేసి 21నుంచి 24 వరకు గ్రామల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు. దీంతో పాటు ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేసి 25వ తేదీన అర్హులైన వారి జాబితాను ఆమోదం కోసం పంపిన అనంతరం 26 నుంచి లబ్ధిదారులకు పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్

బడంగ్‌పేట,జనవరి17: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 15, 16, 24వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులు, 26వ డివిజన్‌లో ఓపెన్ జిమ్‌ను డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు రామిడి కవితా రాంరెడ్డి, ఏనుగు రాముడిలతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అధికారులు త్వరగా పనులు పూర్తి చేయించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర మహేశ్వరి జైయింద్, వంగేటి ప్రభాకర్ రెడ్డి, మల్లారెడి శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

కాప్రా డివిజన్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

కాప్రా, జనవరి 17: కాప్రా సర్కిల్‌లో చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్-2024 కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని డిప్యూటీ కమిషనర్ డి.జగన్ పిలుపునిచ్చారు. డీసీ ఆదేశాల మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని సీఎస్‌నగర్, మల్లికార్జుననగర్, శివసాయినగర్ కాలనీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేక వాహనంతో త్రిపుల్ ఆర్(రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్) పేరుతో సిబ్బంది పాత వస్తుసామగ్రిని సేకరించారు. ఇండ్లనుంచి పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత పుస్తకాలు, బట్టలు, సైకిళ్లు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించారు. ఈ సామగ్రిని సాకేత్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ త్రిపుల్ ఆర్ సెంటర్‌కు తరలించారు. అదేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పూజ, జగదీశ్, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ కృష్ణ, అశోక్,ఎస్ఎఫ్ఏ అంజలి, అరవింద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పరీక్షలు చేస్తున్న కంటి వైద్య నిపుణులు

సైదాబాద్, జనవరి 17 : సైదాబాద్ శంకేశ్వరబజార్‌లోని మసీద్ ఈ హనాఫియా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అజీజ్ పర్ఫెక్ట్ విజన్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు, బీపీ, షుగర్, టెంపరేచర్, వెయింట్ వంటి పరీక్షలను నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులైన ఆస్టోమెట్రిస్ట్, ఆప్టిషియన్స్ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కండ్ల అద్దాలు, మందులు, డ్రాప్స్ అందజేశారు. వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొని తమ వైద్య పరీక్షలు చేయించున్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ ఈ హనాఫియా కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి ఫైసల్, ఉపాధ్యక్షులు హసన్, కోశాధికారి ఆయాజ్, అర్షద్, వహీద్ ఉద్ జమా తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. పొంగుతున్న డ్రైనేజీలు

కుషాయిగూడ డీమార్ట్‌కు వెళ్లే రహదారిలో డ్రైనేజీని చూపుతున్న స్థానికులు

చర్లపల్లి, జనవరి 17 : అధికారుల పర్యవేక్షణ లోపంతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డివిజన్‌లో కోట్లాది నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొనే అధికారులు, ప్రజా ప్రతినిధులకు రోడ్లపై పారుతున్న డ్రైనేజీ కనిపించకపోవడం విడ్డూరమన్నారు. డివిజన్ పరిధిలోని కుషాయిగూడ డీమార్ట్ నుంచి శివసాయినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతున్న పట్టించుకునే వారు లేకపోవడంతో రహదారులపై ఏరులైపారుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్థానికులు హెచ్చరించారు.

ఓపెన్ జిమ్ పరికరాలను బాగు చేయించండి

రామంతాపూర్, జవవరి 17 : శిల్పారామం వద్ద ప్రభుత్వ ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన వ్యాయామ పరికరాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాకర్స్ క్లబ్, ప్రజా వాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, నాయకులు భీష్మాచారి మాట్లాడుతూ.. ఓపెన్ జిమ్‌లపై అధికారుల పర్యవేక్షణ లోపించిందన్నారు. దాంతో పలు పరికరాలు దెబ్బతిన్నాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మలక్‌పేట, జనవరి 17: ప్రమాదాలు లేని సురక్షిత ప్రయాణాలకోసం ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఈస్ట్‌జోన్ ఆర్టీఓ లెక్కల కిష్టయ్య సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఈస్ట్‌జోన్ ఆర్టీఓ ఆధ్వర్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు రోడ్డు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై తిప్పవద్దని, రోడ్డు భద్రతా, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019ల ప్రకారం అది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బస్సులు, లారీలు, గూడ్స్ వాహనాలు, కార్లు, ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్యాసింజర్లను ఎక్కించుకొవద్దని, ప్రమాదకరమని అన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపటం, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపటం, పర్మిట్లు లేకుండా రోడ్లపైకి వాహనాలను తేవటం రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించటమేనని అన్నారు. లైసెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్లు, పొల్యూషన్ సర్టిఫికెట్‌లను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా కలిగి ఉండాలని, నిర్ణీత సమయాల్లో వాహనాలకు ఫిట్‌నెస్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే లైసెన్సులను రద్దు చేయటంతోపాటు, కేసులు నమోదుచేయించి జరిమానాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు, వాహన చోదకులకు గులాబీ పూలు ఇచ్చి వినూత్నంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేశ్‌బాబు, రాధిక, నరేంద్రపాల్, బలరాం, ఏఎంవీఐలు మధుసూదన్‌రెడ్డి, జాన్, అష్పాక్ అహ్మద్, ఏఓలు అంజుం, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది విమలాకుమారి, శైలజ, అరుణ్, శ్రీకాంత్, వినయ్, ఎంఏ కరీం, అరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఈస్ట్‌జోన్ ఆర్టీఓ కిష్టయ్య, ఎంవీఐలు రమేశ్‌బాబు, రాధిక



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ ఎస్ఐ రాము

అవగాహన లేనివారితోనే ప్రమాదాలు..

మలక్‌పేట: ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేనివారే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని మలక్‌పేట ట్రాఫిక్ ఎస్ఐ రాము అన్నారు. రోడ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీధర్ కోచింగ్ సెంటర్‌లో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు, నిరుద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ దేశంలో ప్రతియేట లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతిచెందుతూ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగుల్చుతున్నారని అన్నారు. వేగంకన్నా, ప్రాణం మిన్నా అని, ఎంత తొందరగా చేరుకున్నామన్నది ముఖ్యంకాదని, ఎంత సురక్షితంగా చేరుకున్నామన్నదే ముఖ్యమని ఆయన తెలిపారు. స్పీడ్ థ్రిల్ నిస్తుందని, కాని కిల్ కూడా చేస్తుందని తెలిపారు.

మీర్‌పేట కార్పొరేషన్‌లో పడకేసిన పారిశుధ్యం

లెనిన్‌నగర్‌లో పేరుకు పోయిన చెత్తాచెదారం

లలితానగర్ ప్రధాన రహదారి పక్కన పేరుకు పోయిన చెత్త కుప్ప

బడంగ్‌పేట, జనవరి17: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసిన చెత్త డంపింగ్ యార్డులు దర్శన మిస్తున్నాయి. పారిశుధ్యం పడకేసింది. అనేక రకాల వ్యాధులు వస్తాయని తెలిసినప్పటికి అధికారులు పారిశుధ్యం దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కాలనీలలో ఎక్కడో అనుకుంటే ఏమో అనుకోవచ్చు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల వెంట చెత్త పేరుకుపోయింది. రోడ్ల పై చెత్త పేరుక పోతుందని కాలనీ వాసులు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. మురుగు నీరు రోడ్ల పై పారడం దేవుడు ఎరుగు కానీ కనీసం చెత్తనైనా ఎప్పటికప్పుడు తొలగించాలని ఫిర్యాదులు చేస్తున్నారు. చెత్త కుప్పలలో పందులు సైరవిహారం చేస్తున్నాయి. పందుల వలన మెదడు వ్యాపులాంటి వ్యాధులు వస్తాయని వైద్యులు పలుమార్లు సూచనలు చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. చెత్త డంపింగ్ యాడ్స్ తో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని కాలనీ వాసులు ఫిర్యాదులు చేస్తున్నారు. పారిశుధ్యం లోపించ కుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పారిశుధ్యం లోపిస్తే చికన్ గున్యా, మలేరియా, కలరా తదితర వ్యాధులు వస్తాయని తెలిసిన ప్పటికి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు వాపోతున్నారు. చెత్త సమస్యపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించ లేదు.

రేషన్ కార్డుల సర్వే పరిశీలన

బడంగ్‌పేట, జనవరి17: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో ఆర్వో వేణుగోపాల్, బిల్ కలెక్టర్లు చేస్తున్న రేషన్ కార్డుల సర్వేను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. తప్పులు దొర్లకుండా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సర్వేను చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా చేయాలని సూచించారు. తప్పులు దొర్లితే అందుకు వారే బాధ్యులవుతారన్నారు హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 17 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్-8 డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఏకలవ్య నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11 వరకు, 11కేవీ సలీంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి 12 వరకు, 11కేవీ తీగల గూడా, 11కేవీ వహీద్ నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 12.30 గంటల నుంచి 1 గంట వరకు ఆయా ఫీడర్ల ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చర్లపల్లి డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

చర్లపల్లి, జనవరి 17 : డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం చర్లపల్లి డివిజన్ రెడ్డికాలనీలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ యూజీడీ లైన్స్‌కు సంబంధించి నిధులు కేటాయించాలని జలమండలి ఎండీని కోరి నట్లు తెలిపారు. ఇందుకు ఎండీ సాను కూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఆమె పలువురు నాయకులు ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,జనవరి 17: పట్టాల పక్కన నడుచుకుంటూ వెళుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి(40)శుక్రవారం ఉప్పుగూడ- యాకత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యక్తి వివరాల కోసం 9948695948లో సంప్రదించాలని కోరారు.